# రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక



Editor : **B.V.L.N. Raju**

**విడి ప్రతి : ₹ 12/-**



## శ్రీ రమణ క్షేత్రం - జిన్నూరు

పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్, పిన్ : 534 265

ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 25 సంచిక : 2 అక్టోబరు 2019



**రమణ భాస్కర**

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 24

గౌరవ సంపాదకులు

శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

**చందా**

సంవత్సర చందా:రు॥ 150/-

విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా

**రమణ భాస్కర**

శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
9441122622
7780639977


ఈ సంచికలో....


19-08-1984,
జిన్నూరు
అరుణాచల మహత్యం
శ్రీమద్భగవద్గీత



ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747


## సుఖ స్థానం స్వరూపమే

"నీ స్వరూపమే శాంతి, నీ స్వరూపమే సుఖం" అంటారు భగవాన్ శ్రీరమణమహర్షి. ప్రాపంచిక సుఖాలు, విషయసుఖాలు ఆత్మ యొక్క ఆభాస మాత్రమే! 'ఆభాస' అంటే ఆరోపించబడినది అని అర్థం. త్రాడులో పాము వలె కేవలం ఉన్నదాని స్థానములో లేనిది ఉన్నదాని వలె కనిపించడం. విషయ ప్రపంచము నుండి, ఇంద్రియాల ద్వారా, మనము పొందే సుఖము, 'ఆత్మ' కారణశ్రీస్త్రగా కలిగే ఆభాస సుఖము మాత్రమే! ఆత్మ సుఖము స్వతంత్రము, సర్వవ్యాపకము, అది సర్వకాల సర్వావస్థలలోనూ ఉంటుంది, అదే నేను! ఆత్మ అనంతము కాబట్టి, సకలమునకు ఆధారము ఆత్మే! సూర్యుడు ఉండడం వల్లనే, అతడి నుండి వేడిమి, కాంతి వస్తున్నాయి. అట్లే ఆత్మ ఆధారముగానే ఇంద్రియాల నుండి, విషయాల నుండి, సుఖము వస్తోంది; కాని ఆత్మ సుఖము స్వతంత్రమైనది మరియు జ్ఞానపూర్ణమైనది. మనస్సును, ఇంద్రియాల ద్వారా బాహ్య విషయాలపైకి పోనీయక, మనస్సును దాని మూలము లోనికి ఉపసంహరించుటయే, మన సాధనల యొక్క పరమలక్ష్యం కావాలి. బహిర్ముఖమైన మనస్సు స్వరూపానికి దూరమై,

వాసనలను ప్రోగుచేస్తుంది. దేహాత్మబుద్ధే దుఃఖానికి, జనన మరణ సంసార చక్రానికి, హేతువు అవుతుంది. దేహేంద్రియ మనోబుద్ధులన్నీ జడములే, అవి ఆత్మయందు ఆరోపితములు మాత్రమే, కాని వాటిని చైతన్యవంతము చేయుచున్నది మరియు ఆధారమైనది ఆత్మే! పరమాత్మ సర్వవ్యాపి కాబట్టి అంతటా, అన్నిటా, సమానముగానే ఉన్నాడు, కాని మన అహంకారమే వేరుతనాన్ని, వ్యత్యాసాన్ని కల్పిస్తుంది. అందువల్లే 'మనస్సే - లోకము' అన్నారు భగవాన్ శ్రీరమణమహర్షి. దేహాత్మబుద్ధి నశిస్తే, త్రిపుటిలయమై, అనగా సాధకుడు సాధన సాధ్యము ఏకవస్తువై, కేవలం ఉన్న బ్రహ్మమే 'నేను'గా, 'తాను'గా, అనుభవైకవేద్యం అవుతుంది.

ఓం తత్ సత్

- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064

**భగవంతుడు అందరి హృదయాలలో ఉన్నాడు అని చెపుతున్నారు కదా! మరి ఉంటే నాకు కనబడాలి కదా! అని ఒకరు భగవాన్‌ను అడుగుతున్నారు. దీనికి భగవాన్ ఏమి చెప్పారంటే నీ అలవాట్ల యొక్క వేగం వలన, నీ తలంపుల యొక్క వేగం వలన ఆయన నీకు తెలియటం లేదు. వాటి వేగం అణిగితే ఆయన నీకు తెలుస్తాడు.**



## ముఖ్య గమనిక

**రమణ భాస్కర పత్రిక ప్రతీ నెల 5వ తేదీన పోస్టు చేయటం జరుగుతోంది. పత్రిక 12వ తేదీలోపు మీకు అందని యెడల ఈ క్రింది సెల్ నెంబరుకు ఫోన్ చేసి మీ రశీదు నెంబరు తెలియబరచిన యెడల పత్రిక మరల పోస్టు చేయబడును. కావున భక్తులు గమనించగలరు.**

**సెల్ : 8883174999**



ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

# సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 19 ఆగష్టు 1984, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువులారా!

ధర్మ సంరక్షణార్థము చెప్పవలసివచ్చినప్పుడు మీరు అసత్యము చెప్పినా అది దోషముగా పరిగణించరు అని ఆచార్యులవారు చెప్పారు. లోకహితం కోసం, ధర్మాన్ని రక్షించటం కోసం ఒక్కోసారి అబద్ధం చెప్పవలసివస్తుంది అది పాపము అని అనిపించుకోదు. కోపము రాకుండా ఉంటే మంచిదే కానీ ఈ లోకంలో కోపం రాకుండా ఎంత మంది ఉండగలరు? మనిషికి కోపము తరచుగా వస్తుంది ఆవేశము వస్తుంది. ఆవేశము రాకుండా ఉంటే మంచిదే, కానీ ఆవేశము రాకుండా ఎంత మంది ఉండగలరు? చిరాకు వస్తుంది. చిరాకు రాకుండా ఉంటే మంచిదే, కానీ చిరాకు రాకుండా ఎంతమంది ఉండగలరు? మనం చెప్పుకునే అబద్ధాలు, అబద్ధాలు కావు. మనం చెప్పుకునే నిజాలు, నిజాలు కావు. ఆత్మ ఒక్కటే నిజం.

జగత్తులో వ్యావహారిక జ్ఞానములో సత్యం అక్కరలేదా అంటే కావాలి. ఆచార్యులవారు ఈ రోజు ప్రస్తావించిన విషయం పైకి అది చాల తేలికగా ఉంది, కానీ అది చాలా సూక్ష్మమైన విషయం. ఆ ప్రశ్న తేలికగానే ఉన్నది వినటానికి, సమాధానం తేలికగానే ఉంటుంది. మనకి అర్థం అయిపోయింది అనిపిస్తుంది. సత్యం అనేది మానసికజీవితానికి సంబంధించినది. కొంతమంది మనుషులకి అసలు మానసికజీవితం ఉండదు. ఆధ్యాత్మికజీవితం, మానసిక జీవితం, భౌతికజీవితం మూడురకాల జీవితాలు. కొంతమందికి భౌతికజీవితమే ఉంటుంది కానీ మానసికజీవితం కూడా ఉండదు. ఆధ్యాత్మికజీవితం వరకు వెళ్ళద్దు అసలు. ఊరికే మనం ఏమి తిండి తింటున్నాము, ఏమి గుడ్డ కట్టు కుంటున్నాము, నలుగురిలో మర్యాదగా

ఉంటున్నామా లేదా, మన గురించి అందరు గొప్పగా చెప్పకుంటున్నారా లేదా, ఇలా అనుకుంటూ ఉంటారు. ఇది ఒక రకమైన జబ్బు!

మన గురించి అందరు గొప్పగా చెప్పకుంటున్నారా లేదా అని ఎవరైనా మనస్సులో అనుకుంటే అదొక రకమైన జబ్బు. కొంతమంది వాళ్లని వాళ్ళు పొగుడుకుంటూ ఉంటారు, ఎదుటి వారిని ఏదో రకంగా విమర్శిస్తూ ఉంటారు. అది కూడా ఒక జబ్బు. ఇవన్నీ జబ్బు లక్షణాలే. అనారోగ్య లక్షణాలే. నేను చాలామందిలో చూసినప్పడు భౌతికజీవితం అంటే వాళ్ళు దూడలు గడ్డి ఎలా తింటున్నాయో అలా వీళ్ళు అన్నం తినటం, శుభ్రమైన బట్టలు కట్టుకోవటం, ఈ రకంగా సమాజంలో మనం అందరితో మర్యాదగా ఉంటున్నామో లేదో చూసుకోవటం, శరీరం ఆరోగ్యంగా ఉందో లేదో చూసుకోవటం, అంతవరకు చూసుకుంటారు. శరీరమే కేంద్రంగా పెట్టుకుని జీవించే వాళ్ళే కాని ఇందులో ఒక మనస్సు ఉందని కానీ, ఒక ఆత్మ ఉందని తెలియని మనుషులు అనేకమంది ఉన్నారు. ఆధ్యాత్మిక జీవితం వరకు వెళ్ళద్దు, అసలు మానసికజీవితమే లేదు మనుషులకి. మానసికజీవితం అంటే ఏమిటో తెలియనివాళ్ళకి అసలు ఆధ్యాత్మికజీవితం అంటే ఏమి తెలుస్తుంది? మానసిక జీవితం అంటే ఏమిటో కూడా తెలియని వాళ్ళకి అసలు ఆధ్యాత్మికజీవితం అంటే ఏమిటో తెలియనే తెలియదు. స్పందన అంటే ఎలా ఉంటుందో తెలియదు అసలు. వంద సంవత్సరాలు జీవించినప్పటికిని మనుషులు అలా ఎదుగుతూ ఉంటారు అన్నం తింటారు కాబట్టి అలా ఎప్పుడో స్మశానానికి వెళ్లి పోవటం తప్పించి వాళ్ళకి ఇంక మానసికజీవితం కనిపించదు.

కొంతమంది నీతి అనేది బాహ్యమైన విషయం అని అనుకుంటున్నారు. నీతి అనేది, సత్యం అనేది బాహ్యజీవితానికి సంబంధించినది కాదు. బాహ్యజీవితమే ప్రధానంగా పెట్టుకున్నవాడికి ఎవడికీ ఆత్మదర్శనం కాదు అసలు. నీతి అనేది, సత్యం అనేది, నిజం అనేది ఆంతరంగిక జీవితానికి సంబందించినది. కొంతమంది నిజం చెపుతున్నా, లోపల దురుద్దేశం పెట్టుకుని నిజం చెబుతారు. మేము నిజం చెబుతున్నాము అంటారు. నిజం చెప్పేటప్పడు లోపల ఉద్దేశం ఏమిటి? ఎదుటిమనిషిని పాడుచేద్దామనా! ఎదుటిమనిషిని నాశనం చేద్దామనా, బాగుచేద్దామనా! మీరు నిజం చెపుతున్నాం అనేటప్పడు ఎదుటి మనిషిని పాడు చేద్దామని చెబుతున్నారా, లేకపోతే వాడిని అభివృద్ధిలోకి తీసుకువద్దామని చెబుతున్నారా! అది ఈశ్వరుడు చూసేది! మీ నోరు నిజం చెబుతుంది అని మీరు అనుకుంటున్నారు. కానీ ఈశ్వరుడు చూసేది నిజం చెప్పేటప్పడు హృదయంలో మీ సంకల్పం ఏమిటి? అది చూస్తాడు.

జ్ఞానం అన్నా, ధర్మం అన్నా ఒక్కటే. ధర్మానికి భిన్నంగా జ్ఞానం ఉండదు. జ్ఞానానికి భిన్నంగా ధర్మం ఉండదు. డబ్బుకి బొమ్మ బొరుసు ఎలా ఉంటాయో అలాగే ఒకే నాణానికి రెండు వైపులా ఉంటాయి - ధర్మము, జ్ఞానము. ధర్మం, ధర్మం అంటే జ్ఞానం లేకుండా ధర్మం ఉండదు. ధర్మం అంటే దానం అనుకుంటారు చాలా మంది. ధర్మములో దానం అనేది ఒక భాగమే కానీ, ధర్మం అంటే కేవలం దానం అని కాదు. అది జీవిత ప్రవర్తనకి సంబంధించినది. బాహ్యంగా ఈశ్వరుడు మీ ప్రవర్తనని చూడనే చూడడు. అది ముఖ్యం కాదు అసలు. మీరు ఒక మాట చెప్పినా, ఒక చూపు చూసినా, ఒక తలంపు మీలోకి వచ్చినా, అది ఏ ఉద్దేశంతో మీరు ఆ మాట మాట్లాడుతున్నారో, లోపల ఆ సంకల్పం చూస్తాడు. ఏ ఉద్దేశంతో ఆ మాట మీరు మాట్లాడుతున్నారు, ఏ ఉద్దేశం మీరు లోపల పెట్టుకుంటే, ఆ తలంపు మీకు వస్తోంది దానిని బట్టి మీకు మార్కులు వేస్తాడు ఈశ్వరుడు. అంతే కానీ బాహ్యానికి ప్రదర్శించబడేది కాదు.

నీతి కూడా ఎగ్జిబిషన్ లాగా బాహ్యానికి ప్రదర్శించబడే ఒక వస్తువు కాదు. కేవలం ఆంతరంగిక జీవితానికి సంబందించినది. బాహ్యజీవితానికంటే ఆంతరంగిక జీవితం ఇంకా చాలా గొప్పది. మీరు లోపలికి చూసుకోక అది మీకు తెలియటం లేదు. బాహ్యజీవితం కంటే ఆంతరంగిక జీవితం చాలా గొప్ప విషయం. ఈ లోకం కంటే పెద్ద లోకం మనలో ఉంది. మన కళ్ళకు కనిపించే లోకం కంటే పెద్దది మన లోపల మనకున్న లోకం.

అందుచేత ధర్మం కోసం, ఒక మంచి కోసం, మీరెప్పుడైనా ఒక అబద్ధం చెప్పినా దాని వల్ల మీకు దోషం రాదు అంటున్నాడు ఈశ్వరుడు. ఎందుచేత? లోపల దురుద్దేశం పెట్టుకుని మీరు నిజం చెప్పినప్పటికీ మీకు దోషం వస్తుంది. లోపల మంచి ఉద్దేశం పెట్టుకుని అబద్ధం చెప్పినా మీకు మంచి మార్కులు వేస్తానంటున్నాడు. ఈశ్వరుడే చేస్తానంటున్నాడు! చాలా మంది ఏమి అనుకుంటున్నారంటే మేము నిజం చెప్పేస్తున్నాము అనుకుంటారు. నిజం కూడా హితవుగా చెప్పాలి. నిజం చెబితే మీ నోటికి వచ్చినట్లు చెప్పమని కాదు. హితవుగా చెప్పాలి. ప్రియముగా చెప్పాలి. ఎదుటివాడి ఫీలింగ్ హర్ట్ చెయ్యకుండా చెప్పాలి. నిజం కూడా వాడు బాగుపడటానికి ఉపయోగపడేలా చెప్పాలి, వాడు పాడవటానికి చెప్పకూడదు.

మనిషి బుర్రలో ఎన్ని తలంపులు! ఇవన్నీ మేన్ మేడ్. ద్వైతం అంతా కూడా మేన్ మేడ్. మనుషులు సృష్టించుకున్నవే. పూర్వం ఆడపిల్లలకి వివాహం చేస్తే భర్తలు చనిపోతే మళ్ళీ రెండవ వివాహం ఎవరూ చేసేవారు కాదు. ఇప్పుడు అందరూ చేసేస్తున్నారు. ఇప్పడు అది పాపము (తప్పు) అని ఎవరైనా అనుకుంటున్నారా! పూర్వం పాపం అని అనుకునేవారు. ఇప్పడు ఎవరైనా అనుకుంటున్నారా! ఎందుచేత కారణం ఏమిటి? ఇదంతా మనస్సుకి

సంబంధించినది. దీనికి ఆత్మకి ఎట్టి సంబందము లేదు. కాలం ఎలా ప్రవహిస్తూ ఉంటుందో, సంఘం వ్యవస్థ అలా మారుతూ ఉంటుంది. సంఘంలో అనేక మార్పులు వస్తూ ఉంటాయి, ఇదంతా అబద్ధం. పూర్వం రాజారామ్‌మోహన్‌రాయ్ టైములో కొన్ని కొన్ని రాష్ట్రాలలో ఎటువంటి ఆచారం ఉండేదంటే భర్త చనిపోతే భార్యను కూడా బ్రతికుండగానే తీసుకెళ్ళి ఆ శవం మీద దహనం చేసేసేవారు. భర్త చనిపోతే భార్య బ్రతికుండగానే తీసికెళ్ళి ఆ శవం మీద దహనం చేస్తే అదొక పుణ్యం అని, మంచిది అని అనుకునేవారు. రాజారామ్‌మోహన్‌రాయ్ వాళ్ళు ఉద్యమాలు నడిపారు. తరువాత గవర్నమెంట్ కూడా దానిని నిషేదించింది. ఇప్పుడు భర్త చనిపోతే భార్య కూడా వెళ్ళి చనిపోతాను అంటే గవర్నమెంట్ ఊరుకోదు, కేసు పెడుతుంది. అలా చనిపోతే పుణ్యం అని ఇప్పుడు ఏ స్త్రీ అయినా అనుకుంటుందా! మా ఆయన పోయాడు మనం కూడా చనిపోదాము అలా చనిపోతే పుణ్యం అని అనుకుంటున్నారా! పూర్వం అలా అనుకునే ఆడవాళ్ళు కూడా ఉండేవారు. ఇదంతా ఏమిటి?మనస్సు యొక్క కల్పితం.

సంఘం యొక్క వ్యవస్థలో వచ్చేమార్పులకు, ఆధ్యాత్మికజీవితానికీ ఎటువంటి సంబంధము లేదు. అంటే ఇదంతా మనస్సు కల్పిస్తోంది. సమాజం పురోభివృద్ధి అయ్యేకొలది, సమాజంలో మార్పులు వచ్చే కొలది, సోషల్ కండిషన్స్ మారే కొలది, ఇది పాపం అని, ఇది పుణ్యం అని, ఇదంతా సమాజం యొక్క సృష్టి, మనుషుల యొక్క సృష్టి. ఈ వ్యవస్థ అంతా కూడా మనుషుల యొక్క మనస్సుల లోంచి వచ్చిందే. మన రాజ్యాంగంలో ఈ పొరపాటు ఉంది, ఆ పొరపాటు ఉంది అని దానిని మార్చేస్తారు. ఇంకా భవిష్యత్తులో ఎన్ని మార్పులు వస్తాయో! ఇదంతా నిజం కాదు. పారమార్థిక నిజం మటుకు ఇది కాదు. పారమార్థిక సత్యం ఇది కాదు. మనస్సులో కల్పించుకున్న గొడవలు ఇవన్నీ. దీని గురించి మీ కాలాన్ని వృథా చేసుకోవద్దు. ఈ బాహ్యగొడవల గురించి మీ శక్తిని వృథా చేసుకోవద్దు. బాహ్యగొడవలు ఇలా మారుతూనే ఉంటాయి.

మీరు ఆత్మ వైపుకి ప్రయాణం చేయకుండా ఊరిలో ఉన్న గొడవలు, లేకపోతే ఎల్లమ్మ చెప్పింది అని, పుల్లమ్మ చెప్పింది అని ఇటువంటి గొడవలు ఎందుకు? రాగద్వేషాలు తప్పించి



**లోపల ఉన్న వస్తువు సహజంగా ఉంది, నిర్మలంగా ఉంది. దైనందిన జీవితంలో మన ప్రవర్తన నిర్మలంగా, సహజంగా ఉండేటట్లు తీర్చిదిద్దుకుంటే ఆ వస్తువు మనకు అందుతుంది. ఆత్మ అట్టిది, ఇట్టిది అని అనుకోవటం జ్ఞానం కాదు. ఆత్మగా ఉండటం జ్ఞానం.**

లోకంలో ఏమీ లేదు. మీరు ఊళ్ళో గొడవలు వినండి, అన్నీ రాగద్వేషాలే, దేశంలో గొడవలు వినండి, అన్నీ రాగద్వేషాలే! పేపరులో గొడవలలో కానీ, దేశంలో గొడవలలో కానీ, రాగద్వేషాలు తప్పించి, లైక్స్ అండ్ డిజ్లయిక్స్ తప్పించి లోకంలో ఏమీ లేవు. రాగద్వేషాలతోటే లోకం అంతా నిండి ఉంది. అంతకు తప్పించి ఏమీ లేదు అసలు.

ఏదైతే సత్యమో, దాని వైపుకే మన దృష్టిని, మనకున్న శక్తిని, మనకున్న యుక్తిని, మనకి ఉన్న తెలివిని, మనకి ఉన్న ప్రతిభని, మనకి ఉన్న అవకాశాలు అన్నిటిని కూడా కేవలము ఆత్మ వైపుకే ప్రయాణం చేయించాలి. మీ సమస్త శక్తులని ఆత్మ వైపుకే నూటికి నూరు పాళ్ళు ఎవరైతే గురి పెడతాడో వాడికే ఆత్మ దర్శనం అవుతుంది. స్లిట్ అవ్వటానికి వీలు లేదు. మీకు ఉన్న శక్తులలో కొంచం శక్తి కూడా స్లిట్ అవ్వకుండా ఉంటే, మొత్తం శక్తినంతా కూడా ఆత్మని తెలుసుకోవటానికే కనుక ఉపయోగిస్తూ ఉంటే వాడికే ఆత్మ దర్శనం అవుతుంది.

మన ఊహకి, ఆత్మకి ఎట్టి సంబందము లేదు. ఒక్కోసారి తాడుని చూసి పాము అని మనం కంగారు పడతాము. చీకటిలో ఏదైనా తాడు కనిపించింది అనుకోండి అది పాము అనుకొని ఉలిక్కి పడతాం మనం. మనం మనస్సులో కంగారుపడి ఉలిక్కి పడతామే కాని, తాడుకి పాముకి ఏమైనా సంబంధం ఉందా అసలు? మీరు ఆలోచించండి. పాముకి ఉన్న గుణాలు ఏమైనా తాడుకి ఉన్నాయా అసలు. పోనీ తాడుకి ఉన్న లక్షణాలు ఏమైనా పాముకి ఉన్నాయా! దీనికి దానికి పోలిక ఏమైనా ఉందా అసలు. కానీ మనం ఉలిక్కి పడతాం. మనకి భయం వేస్తుంది. ఎందుచేత భయం వేస్తుంది? మనం తాడుని చూసి పాము ఏమో అని మనస్సులో అనుకుంటాము. అది పాము కాకపోయినా కంగారు పడుతున్నాము, ముచ్చెమటలు పోస్తున్నాయి. మనకి భయం వేసిన మాట నిజం. అదే విధముగా ఈ లోకానికి, మాయకి, భగవంతుడికి ఎట్టి సంబందము లేదు అసలు. తాడుకి, పాముకి ఎలా అయితే సంబంధము లేదో, అలాగ ఆత్మకి లోకానికి ఎట్టి సంబందము లేదు. తాడుని తాడుగా చూడగలిగితే అసలు భయమే పుట్టదు. ఉన్నది ఆత్మే.

జ్ఞానికి లోకం కూడా ఆత్మగానే కనబడుతుంది, వాడికి భయం అనే సమస్య కలుగదు. భయం ఉందంటే వాడు జ్ఞాని ఎలా అవుతాడు. చాలామంది పాపం చెయ్యటానికి, పొరపాట్లు చెయ్యటానికి, అబద్ధాలు చెప్పటానికి కారణం వాళ్ళకి తెలియక పోవచ్చును కానీ లోపల భయమే కారణం. కొంతమంది లాభం కోసం అబద్ధం చెబితే, ఈ నాలుగు రూపాయల లాభం కోసము అబద్ధము చెప్పాడు అనుకోవచ్చు. కొంత మంది లాభం అక్కరలేకుండా కూడా అబద్ధం చెబుతారు, కారణం కేవలం భయం. భయం వలనే మనిషి అబద్ధాలు చెబుతాడు. భయం వలనే మనిషి

కంగారు పడతాడు. భయం వలనే ఆత్మని తెలుసుకోలేడు. సమస్త రోగాలకి భయమే కారణం. ఇవన్నీ ద్వంద్వాలు. ఆచార్యులవారు బాహ్యానికి చెప్పారు కాని ఇది కూడా నిజం కాదు. బాహ్యానికి చెప్పారు. అసలు అబద్ధం ఎందుకు చెప్పకూడదో మీరు చెప్పండి ఎవరైనా!

మహాత్మా గాంధీ గారు చిన్నతనంలో వాళ్ళ ఇంటి దగ్గర దొంగతనం చేసారు. పూర్వం డబ్బులు దాచుకోవటానికి గూళ్ళు ఉండేవి. మహాత్మా గాంధీ గారు చెడ్డ స్నేహాలవలన, జతలు పట్టి పిల్లలు ఎవరో బీడీలు కాల్చుకుందాము డబ్బులు తెమ్మన్నారు, ఒక రూపాయో, అర్ధ రూపాయో తెమ్మన్నారు. గాంధీ గారు చిన్నతనంలో తల్లికి తండ్రికి చెప్పకుండా ఆ గూట్లో రూపాయో, అర్ధ రూపాయో తీసుకున్నారు ఆ పిల్లల జత పట్టాడు, వాళ్ళ కూడా కొట్లోకి వెళ్ళాడు, బీడీలు కొనుక్కున్నారు, బీడీలు కాల్చేశారు. డబ్బులు అయిపోయాయి. గాంధీ గారి తల్లి గూట్లో అర్ధ రూపాయి పెట్టాను కనబడటం లేదు ఏంటి, కనబడటం లేదు ఏంటి అని అనుకుంది. ఇవన్నీ వినేవాడు ఈయన. గూట్లో అర్ధ రూపాయి బీడీలకి ఖర్చు పెట్టేసాడు ఈయన. తల్లి గూట్లో అర్ద రూపాయి ఏమయ్యింది అని అనుకునేది.

ఇదే ఇక్కడ మీరు గ్రహించవలసింది. గాంధీగారు తీసారని తల్లి ఏమీ అనుమానించ లేదు, తండ్రి ఏమీ అనుమానించలేదు. నువ్వు తీశావా అబ్బాయ్ అని ఎవరు అడగలేదు. ఎందుచేతంటే గాంధీ గారి మీద అనుమానం రావటం లేదు అసలు వాళ్ళకి. గాంధీ గారు హాయిగా ఉండవచ్చును కదా! గాంధీ గారు దొంగతనం చేసినట్లు గాంధీ గారికి తెలుసు. మనం దొంగతనం చేసాం, మనం దొంగతనం చేసాం, అనుకొంటున్నారు. ఆయన్ని ఎవరూ అనుమానించలేదు, అడగటం లేదు. ఆయన్ని ఎవరూ ఏమి అనటం లేదు. అయినా ఆయన మనం దొంగతనం చేసాం అని ఆయనలో ఆయనే బాధ పడిపోయారు. పోనీ ఆయన్ని ఎవరైనా అడిగారా, పోనీ దండించారా, హింసించారా! ఏమీ లేదు. అందుచేత ఏమి చేసాడు?నాలుగు రోజులు చూసాడు. ఇంకా బాధ పెరిగి పోతోంది ఆయనకి లోపల. ఆయనని ఎవ్వరు ఏమి అడగడం లేదు. ఆయన మనస్సులో ఆయనకి బాధ పెరిగి పోతోంది. ఏమిటి? ఎలాగా? ఈ అర్ధ రూపాయి గొడవ ఎలాగా? ఆ పోయిన రోజు అనుకున్నారు వాళ్ళు అర్ధ రూపాయి పోయింది అని, తరువాత రోజు నుంచి అసలు వాళ్లకి ఆ గొడవే లేదు. కాని ఈయనకి మటుకు మనస్సులో విపరీతమైన బాధ వచ్చేస్తోంది. ఈ బాధని పోగొట్టుకోవటం ఎలాగో ఆయనకి తెలియటం లేదు. అర్ధ రూపాయి నేనే తీసానని చెప్పటానికి సిగ్గు వేస్తోంది.

అప్పడు గాంధీగారు ఏం చేసారు? కాగితం పెన్సిల్ తీసుకుని దాని మీద రాసారు. పలానా రోజున అర్ధ రుపాయి పోయిందని మీరు అనుకుంటున్నారు, ఈ మధ్యన నేను కొన్ని చెడ్డ స్నేహాలు చేశాను, ఆ చెడ్డ స్నేహాల వలన బీడీలకి డబ్బులు దొంగిలించుకొని రమ్మన్నారు ఇంటి దగ్గర నుంచి. అర్ధ రూపాయి నేనే పట్టుకుపోయాను కాని ఎవరో పట్టుకుపోయారని మీరు అనుకుంటున్నారు. అందుచేత ఇంకెప్పడు గూట్లో అర్ధ రూపాయి తియ్యను అని రాసి తండ్రికి చూపించాడు. నోటితో చెప్పటానికి సిగ్గేసి కాగితం ముక్క మీద రాసి చూపిస్తే, తండ్రి ఏమి చేసాడు? నువ్వెందుకు తీసావురా అని అడగలేదు. కాగితం చదువుకుని ఇంకెప్పడు తియ్యకురా అని అనలేదు. ఈ పని చేసినందుకు నేను చాలా పశ్చాత్తాపడుతున్నాను అన్నారు గాంధీగారు. తండ్రి గారు ఏమి మాట్లాడలేదు. నేను ఏమి చెప్పక్కరలేదు నీకు. నీ పశ్చాత్తాపమే నిన్ను బాగు చేస్తుంది. నువ్వు పడ్డ పశ్చాత్తాపమే నిజం. నేను మాటలు చెప్పక్కరలేదు. నువ్వు పడ్డ పశ్చాత్తాపము వల్లనే నువ్వు అభివృద్ధిలోకి వస్తావు అన్నాడు.

గాంధీ గారు చేసిన పొరపాటు వలన దుఃఖం ఎవరికి వచ్చింది?ఎవరికీ రాలేదు, ఆయనకే వచ్చింది. ఆచార్యులు వారు ఈ ప్రస్తావన తీసుకొచ్చారు కానీ, అబద్ధమంటే అబద్ధం ఒకటే కాదు అసలు,  ఏ పని అయితే మనల్ని చెయ్యద్దు అన్నారో, ఈశ్వరుడు చెయ్యొద్దని నిషేదించాడో, దానిని నిషిద్ధకర్మ అంటారు. ఇది కూడని పని అని ఈశ్వరుడు ఏ పని గురించి అయితే చెప్పాడో దానిని నిషిద్ధకర్మ అంటారు. ఆ పని చేయటం వలన చేసిన వాడికి దుఃఖం వస్తుంది కాబట్టి ఆ పని మానేయ్యమన్నాడు.

మీరు గ్రహించవలసింది ఆచార్యులవారు చెప్పారా, కృష్ణుడు చెప్పారా, రాముడు చెప్పారా, అలా అని మీరు ఎవరూ వెళ్ళద్దు. మిమ్మల్ని మీ సొంత కాళ్ళ మీద నిలబడమని నేను కోరతాను. మిమ్మల్ని నేను కోరేది ఏంటంటే ఆచార్యుల వారు చెప్పారు కాబట్టి మనం చెయ్యాలి, లేకపోతే భగవంతుడు కృష్ణుడు చెప్పాడు కాబట్టి మనం చెయ్యాలి, లేకపోతే ఏసుక్రీస్తు చెప్పాడు కాబట్టి అలా చెయ్యాలి అనుకుంటే మీ మనస్సు లోపలికి  వెళ్ళదు. నా మాటలు జాగ్రత్తగా వినండి. ఈ జన్మలో కాదు వచ్చే జన్మలో కూడా విషయం అర్థం కాకపోతే, రాముడు చెప్పాడు కదా, కృష్ణుడు చెప్పాడు కదా, ఏసుక్రీస్తు చెప్పాడు కదా అని, అలా మీ మనస్సు ఆలోచిస్తూ ఉంటే మీ మనస్సు

**నది వెళ్ళి సముద్రంలో ఎలా ఐక్యమవుతుందో అలాగ నీ మనస్సు వెళ్ళి హృదయంలో ఐక్యం అవ్వాలి.  అదే నీ జీవిత గమ్యం.**



లోపలికి వెళ్ళదు, మీకు జ్ఞానం రాదు. ఎందుకు చెప్పారు వాళ్ళు? ఏ పని అయితే భగవంతుడు వద్దని చెప్పాడో, ఆ పని కనుక మీరు చేస్తే మీకు దుఃఖం వస్తుంది కాబట్టి వద్దని చెబుతున్నాడు. అది మీరు ఇక్కడ గ్రహించవలసిన పాయింట్. ఆ విషయం మీకు అర్థం అయ్యేవరకు శాస్త్ర మర్యాదే మీకు తెలియదు అసలు. మీకు శాస్త్రం అంటే ఏమిటో దాని విలువ ఏమిటో,శాస్త్రము యొక్క మర్యాద ఏంటో ఈ క్లూ మీకు అర్థం అవ్వాలి.

భగవంతుడు చెప్పాడు అంటే మిమ్మల్ని బాధ పెట్టటానికి భగవంతుడు చెప్పాడా! మీకు దుఃఖం రాకుండా ఉండాలని భగవంతుడి ఉద్దేశం. ఏ పని చేస్తే మీకు దుఃఖం వస్తుందో ఆ పనిని విడిచి పెట్టమన్నాడు. దానిని నిషిద్ధకర్మల క్రింద అక్కడ పెట్టాడు. మన కోసమే పెట్టాడు కాని ఆయన ఏమీ శాసించటానికి కాదు.

మనకి చుట్టాలు,స్నేహితులు ఇలా అనుకుంటాం. భగవంతుడికి చుట్టాలు ఏంటి? స్నేహితులు ఏంటి? భగవంతుడు చుట్టాలు స్నేహితులు అనుకుంటే అభిమన్యుడు చనిపోతాడా యుద్ధంలో. వాడు మేనల్లుడే కదా! కృష్ణుడికి స్వయంగా మేనల్లుడే. తనకంటే వేరుగా ఏదైనా ఉందా! లోపల అజ్ఞానం ఉన్నంత కాలం అది మనలను పీడించేస్తుంది. పాపం, పుణ్యం, ద్వైతం వచ్చేస్తూ ఉంటుంది మనస్సులోకి, జ్ఞాని అయ్యేవరకు.

యుద్ధంలో కర్ణుడి రథచక్రం భూమిలో దిగిపోతుంది. కర్ణుడు రథం దిగి చక్రం తీసేటప్పుడు భగవంతుడు వాసుదేవస్వామి అర్జునుడితో కర్ణుడిని చంపమంటాడు. ఇతను చంపడు. ఎందుచేతంటే కర్ణుడు రథం యొక్క చక్రాన్ని ఎత్తు కుంటున్నాడు, ఇప్పుడు అతను చక్రాన్ని తీసుకుంటున్నాడు ఈ టైంలో చంపకూడదు, అది యుద్ధం యొక్క మర్యాద కాదు అని అర్జునుడి ఉద్దేశం. భగవంతుడు నువ్వు చంపెయ్యి, నువ్వు చంపెయ్యి అంటున్నాడు. అర్జునుడు ఆ పని చెయ్యటం లేదు. ఇక్కడ మీరు ఆలోచించండి. భగవంతుడు చెబుతున్నాడు చంపమని. అయినా అర్జునుడు చంపటం లేదు. ఎందుచేతంటే మనకి పాపం వస్తుంది అని లోపల భయం. పైకి అర్జునుడు చెప్పటం లేదు. కాని భగవంతుడు చెప్పినా చెయ్యటం లేదు. భగవంతుడే చెబుతున్నాడు స్వయంగా వాడ్ని చంపెయ్యరా, వాడ్ని చంపెయ్యరా అని. కాని వీడికి ఏమిటి లోపల, నాకు పాపము వచ్చేస్తుందేమో , పాపకర్మ నా తలకి చుట్టుకుంటుందేమో, వీడు చంపమంటున్నాడు అని లోపల భయం. పాపము వస్తుంది అన్న మాట పైకి చెప్పటం లేదు. అప్పుడు కృష్ణుడు గ్రహించాడు వీడు ఎందుకు చంపటం లేదో! భగవంతుడు గ్రహించి ఏం అన్నాడంటే నీ పాపాన్ని నేను భరిస్తానురా, నువ్వు చంపు అన్నాడు. భగవంతుడు ఎన్ని సార్లు చెప్పినా అర్జునుడు చంపటం లేదు. లోపల అర్జునుడి

ఉద్దేశం ఏంటంటే ఇటువంటి పరిస్థితులలో చంపితే మనకి పాపం అని. అప్పుడు భగవంతుడు ఏం చెప్పాడంటే నీ పాపాన్ని నేను భరిస్తాను, నువ్వు చంపు అన్నాడు. అప్పుడు కానీ అర్జునుడు చంపలేదు కర్ణుడిని! ఇప్పుడు ఆచార్యులవారు చెప్పింది సరిపోయిందా అండి మీకు!

మీకు ఒక ఉదాహరణ చెబుతాను. ఆచార్యులవారు ఏమన్నారు? ఒక మంచి కోసం, ధర్మ రక్షణ కోసం, నువ్వు అబద్ధం చెప్పినప్పటికి ఆ పాపం నిన్ను అంటదు అన్నారు. కర్ణుడిని ఏదో రకంగా చంపాలి అక్కడ. అది కాదండి ఒక మనిషిని చంపాలి అని భగవంతుడు నిర్ణయించుకున్నాడు. వాడిని ఎలా చంపితే చస్తాడో అలానే చంపుతాడు! ఒక డాక్టర్ గారు మనిషికి ఆపరేషన్ చెయ్యాలని నిర్ణయించుకున్నారు. ఆ ఆపరేషన్ ప్రొసీజర్ ఎక్కడ చెయ్యాలో, ఎలా చెయ్యాలో అలాగే చేస్తాడు, కాని మీకు బాధ వస్తుంది అని మానతారా అది! అక్కడ కర్ణుడిని చంపాలని భగవంతుడు నిర్ణయించుకున్నాడు వాడిని ఎలా చంపాలో అలానే చంపుతాడు, పుణ్యం, పాపం అనేవి మనస్సుకి సంబంధించినది. జీవుడికి సంబంధించినవి. భగవంతుడికి పుణ్యం ఏమిటి? పాపం ఏమిటి?

కొంతమంది ఏం అంటారు అంటే, రాముడు వాలిని చెట్టు చాటు నుంచి ఎందుకు కొట్టాడండి? రామాయణం చదివిన వారు రాముడిని ఏమని విమర్శిస్తారంటే, వాలిని చెట్టు చాటు నుంచి ఎందుకు కొట్టాడండి, ఎదురుగుండా కొట్ట కూడదా! ఎదురుగుండా కొడితే వాడు చావడు. అందుచేత చెట్టు చాటు నుంచి కొట్టాడు! వాడిని చంపటానికి భగవంతుడు ఒక నిర్ణయానికి వచ్చాడు. వాడిని చంపటానికి ఒక నిర్ణయానికి వచ్చాక వాడిని ఎలా చంపితే చస్తాడో అలా చంపుతాడు కాని ఎదురుగుండా వచ్చి ఎలా చంపుతాడు? ఇది మీరు ఎందుకు అర్థం చేసుకోవటం లేదు? ఎదురుగుండా వస్తే వాడు చావడు. కాని వాడిని చంపవలసిన సమయం వచ్చింది అక్కడ. అందుకని చంపాడు. ఇది మీకు ఎలా ఉంది? దోషం కింద ఉంది. పాపం కింద ఉంది. కాని ఇది పాపం కాదు. ఆచార్యులవారు చెప్పేది ఏంటంటే ఒక మంచి కోసం, ఒక ధర్మం కోసం, ఏదైనా ఒక అబద్ధం చెప్పినప్పటికి దాని వలన మీకు దోషం అంటదు అని చెపుతున్నారు.



**ప్రతీ సంయోగంలోను వియోగం ఉంది అని చెప్పారు.**
**నీవు కాని దానిని నీవు పట్టుకొన్నంతసేపు దానితో వియోగం తప్పదు.**



# మహాత్మా గాంధీగారు

**అక్టోబర్ 2వ తేదీ మహాత్మా గాంధీ గారి జయంతి. శ్రీనాన్నగారు గాంధీగారిని ఎంతో గౌరవించే వారు. గాంధీగారి గురించి శ్రీనాన్నగారు చెప్పిన కొన్ని విషయాలు అనుగ్రహభాషణముల నుండి.**

**- సేకరణ : బేబీ, హైదరాబాద్**

మహాత్మా గాంధీ గారికి భగవద్గీత అంటే చాలా ఇష్టం. ఆయన ఎంత రాజకీయాలలో ఉన్నా జీవితం పొడుగునా రామనామం విడిచిపెట్టలేదు, భక్తిని విడిచిపెట్టలేదు. ఈ రాజకీయాలు అన్నీ మాయ అని ఆయనకి తెలుసు. ఇతరులకి పదవులు పంచిపెట్టాడు కాని ఆయనకి ఏమీ అక్కరలేదు.

మా అమ్మ చిన్నతనంలో చనిపోయింది, అందుచేత మాకు మంచి చెడ్డలు చెప్పేవారు లేరు. నాకు ఏదైనా దుఖం వచ్చినా, బెంగ వచ్చినా, ఎవరైనా ఏవైనా మాటలు అన్నా, ఎవరితోను చెప్పకోనేవాడిని కాదు, భగవద్గీత చదువుకొనే వాడిని. అందులో ఏదో ఒక శ్లోకం నన్ను ఊరుకోపెట్టేది. అందుచేత అమ్మ పోయినా, అమ్మ లేని లోటు నాకు ఎప్పుడూ రాలేదు, ఆ లోటు భగవద్గీత తీర్చేసింది అని చెప్పారు గాంధీగారు. అసలు భగవద్గీత నేను చదివి ఉండకపోతే, అర్థం చేసుకొని ఉండకపోతే, నాకు పిచ్చెక్కి ఉండేది అన్నారు.

మరి దేశం యొక్క స్వాతంత్ర్యం కోసం 60 కోట్ల మంది ప్రజలతో ఉద్యమం నడపటం అంటే మాటలా? గాంధీ గారే సంశయిస్తే మనం చెప్పగలమా? ఆయన భగవద్గీత తీసుకొని, ఈ దుఃఖం మనకి ఎక్కడ పోతుంది, ఏ శ్లోకంలో ఏ పాయింట్ దొరుకుతుంది, అని వెయ్యి కళ్ళతో ఆ శాస్త్రాన్ని దగ్గర పెట్టుకొని చూసి దుఃఖాన్ని ఉపశమించుకొనేవారు.

మనం ఇంట్లో కృష్ణుడి పటం, భగవాన్ పటం పెట్టుకొంటున్నాం. గాంధీగారు మూడుకోతుల బొమ్మ ఎప్పుడూ ఎదురుగా పెట్టుకునేవారు. ఆ మూడు కోతుల బొమ్మల్లో, ఒక కోతేమో కళ్ళు మూసుకొంటుంది - చెడు చూడవద్దని; ఒక కోతేమో చెవులు మూసుకొంటుంది - చెడు వినొద్దని; ఒక కోతేమో నోరు మూసుకొంటుంది - చెడు మాట్లాడవద్దని. ఈ మూడు కోతులూ నాకు గురువులు అని గాంధీగారు చెప్పారు.

మన బుద్ధిలో ఒక్క దోషం ఉన్నా మనకి అమృతానుభావం కలుగదు. గాంధీగారిలో గొప్పతనం ఏమిటంటే, ఆయనకి చిరాకు లేదు, విసుగు లేదు. అందరూ మన అభిప్రాయాల తోటి సమానంగా ఉండరు. ఆయన భావాలతోటి విరుద్ధంగా ఉండేవాళ్ళు ఎవరైనా వచ్చినా విసుగు లేకుండా మాట్లాడేవారు. అంటే స్నేహం స్నేహమే, రాజకీయం రాజకీయమే. గాంధిగారి విరోధులు ఎవరైనా ఆయన దగ్గరికి వచ్చి మాట్లాడతా ఉంటే కూడా, వీడు మనకి అపకారం తలపెడుతున్నాడని తెలిసినా కూడా, సౌమ్యంగా మాట్లాడేవాడు, ఇష్టంగా మాట్లాడేవాడు, కోపం లేకుండా మాట్లాడేవాడు. అన్నిటికంటే ముఖ్యం, నిర్లక్ష్యం లేకుండా మాట్లాడేవాడు. వాడు బాపూజీ! మనం ఇష్టం లేని వాళ్ళు వస్తే నిర్లక్ష్యంగా మాట్లాడతాము. వాళ్ళు మనం అంటే ఇష్టపడటం లేదు అనుకొన్నప్పుడు నిర్లక్ష్యంగా మాట్లాడతాము. అది మంచి పద్ధతి కాదు, క్రమశిక్షణ కాదు. వాళ్లకి మన మీద ఇష్టం లేకపోతే లేకపోవచ్చును, కాని మనకి నిర్లక్ష్యం పనికిరాదు.

ఆయన ఒక మాట చెప్పారు. మనం గుళ్ళోకి వెళ్లి పూజ చెయ్యటమే కాదు. అందరి హృదయాలలో ఉన్న భగవంతుడిని మనం చూడగలుగుతూ ఉంటే, అందరి మనుషలని మనం సమానంగా చూడగలిగితే, మనకి ఒకవేళ గుళ్ళోకి వెళ్ళే అలవాటు లేకపోయినా, భగవంతుడు తనకి పూజ చేస్తున్నట్టుగానే భావిస్తాడు. అంటే సమానత్వం కూడా భగవంతుడు గుర్తిస్తాడు అని.

**బోయవాడు జంతువును ఎలా వెంటాడి వేటాడతాడో అలాగ నీకు అమృతానుభవం కలిగే వరకూ జన్మ జన్మలకు గురువు నిన్ను వెంటాడతాడు.**



గాంధీగారు దక్షిణాఫ్రికాలో ఉండగా, తెల్లవాళ్ళకి ఉన్న స్వతంత్రం నల్లవాళ్ళకి ఉండేది కాదు. నల్లవాళ్ళని అందరినీ బానిసల కింద చూసేవాళ్ళు. అటువంటప్పుడు తెల్లవాళ్ళకి వ్యతిరేకంగా అహింసాపద్ధతి లోనే పోరాడేవారు. దక్షిణాఫ్రికాలో కూడా చాలా సార్లు అక్కడి ప్రభుత్వం ఈయనని జైలులో పెట్టేది. జైలులో ఎన్నాళ్ళు పెడితే అన్నాళ్ళు ఉండి బయటికి వచ్చేస్తాడు కానీ కోపం పెట్టుకోరు. అది ఆయన అలవాటు.

అప్పుడు దక్షిణాఫ్రికాలో అధికారంలో ఉన్న ప్రధానమంత్రి ఈయనని ఒక సారి జైలులో పెట్టాడు. గాంధీగారికి చెప్పలు బాగా కుట్టటం వచ్చు. ఈయనని జైలులో పెట్టించిన ప్రధాన మంత్రికి ఒక జత మంచి చెప్పలు కుట్టి పంపాడు. ఆ ప్రధానమంత్రి గారు ఆ చెప్పలు ఒక నెల ఉంచుకొని మళ్ళీ గాంధీగారికి పంపేశాడు. మీరు మా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్నారు కాబట్టి మిమ్మల్ని జైలులో పెడుతున్నాము కానీ, మీ విలువ మీ మంచితనం తెలియక కాదు. వ్యక్తిగతంగా మీమీద మాకు కోపం ఏమీ లేదు. మీరు ఎంత గొప్ప వ్యక్తో మాకు తెలుసు. నేను ప్రధానమంత్రి పదవిలో ఉన్నాను, మీరు సామాన్యవ్యక్తిగా ఇప్పడు ఉన్నారు. నేను ఎంత అధికారంలో ఉన్నా ఎంత పదవిలో ఉన్నా మీ చేతితోటి కుట్టిన చెప్పలు నేను తొడుక్కునేటంత సమర్థుడిని కాదు, అంత యోగ్యత అర్హత నాకు లేదు. నన్ను అంత పెద్దవాడిని చేయొద్దు అన్నాడు.

గాంధీగారిని ఏ రోజున అయితే చంపేసారో ఆరోజున గాంధీగారు ఒకమాట అన్నారు. ఢిల్లీలో నాకు పని అయిపోయింది రేపు నాగపూర్ దగ్గర సేవాగ్రామ్ ఆశ్రమానికి వెళ్ళిపోతాను అని ప్రయాణం పెట్టుకున్నాడు. ఇంకో గంటలో ఏం జరుగుతుందో ఆయనకి తెలియదు, ఆయనా జీవుడే! అయితే సత్కర్మ చేసి, మంచిపని చేసి, మంచి మాటలు మాట్లాడి, ఇతరులు కోసం జీవించి మహాత్ముడు అయ్యాడు. ఇతరుల కోసం జీవించే వాడు సజీవంగా ఉంటాడు. ముక్కులో గాలి తిరుగుతున్నా ఇతరుల గురించి ఏమీ ఆలోచించని వాడు చనిపోయిన వాడితోటి సమానం.

గాంధీగారు చెప్పిన మాటలలో ఇదొక్కటీ మీరు గుర్తు పెట్టుకోండి. సమాజం మీపట్ల ఎలా వ్యవహరిస్తోంది, ఇతరులు మీ పట్ల ఎలా వ్యవహరిస్తున్నారు ఆ గొడవ మీకు వద్దు; ఇతరుల పట్ల మీరు బాగా వ్యవహరిస్తున్నారా లేదా చూసుకోండి. ఎందుచేతనంటే మీ

ప్రవర్తనని బట్టి మీకు మోక్షం వస్తుంది కానీ ఇతరులు నిన్ను ఎలా చూస్తున్నారో దానిని బట్టి భగవంతుడు మీకు మోక్షాన్ని ఇవ్వడు. మీ ప్రవర్తనని బట్టి, ఈశ్వరుని దయకి మీరు పాత్రులు అవుతారు. అప్పుడు ఆయన స్వరూపాన్ని మీకు ఇస్తాడు. అదే మోక్షం, అదే నిర్వాణ స్థితి. అదే స్వర్గరాజ్యం. ఆ స్థితి పొందేవరకు, సముద్రంలో ఎన్ని కెరటాలు ఉన్నాయో అన్ని జన్మలు మీకు వస్తూనే ఉంటాయి. ఇది ప్రకృతి!

గాంధీగారి దగ్గర మనం నేర్చుకోవలసింది ఏమిటంటే, పని మీద మనస్సు పెట్టండి. పని మీదే మీ ఏకాగ్రత పెట్టండి. ఫలితం మీద పెట్టొద్దు, ఫలితం మీద పెడితే చివరికి మోత మిగులుతుంది. ఫలితం వచ్చేది ఎలాగూ వస్తుంది. పని మన చేతిలో ఉంది, ఫలితం అనేది భగవంతుడి చేతిలో ఉంది. భగవంతుడు ఒకో శరీరం ద్వారా ఒకో పని చేయిస్తాడు. మీ కుటుంబానికి సంబంధించిన పని మీరు చూసుకోవాలి. మీ కుటుంబానికి సంబంధించిన పని ఎంత శ్రద్ధగా చేసుకొంటారో, సమాజానికి చేసే పని కూడా అంత శ్రద్ధగా చేయాలి. ఏమీ ఆడంబరం లేకుండా జీవించాలి. ముముక్షత్వం, అంటే రాముడిలో ఐక్యమవ్వటానికి ప్రయత్నం చేయాలి. స్వరాజ్యం వచ్చిందని నేను సంతోషించటం లేదు, రామరాజ్యం వస్తే సంతోషిస్తాను అని చెప్పారు.

గాంధీగారు స్వాతంత్ర్యం వచ్చిన రోజున కలకత్తాలో, బెంగాల్లో ఉన్నారు. జవహర్లాల్ నెహ్రూగారు ఢిల్లీ రమ్మని ఆహ్వాన పత్రం పంపితే, నాకు ఢిల్లీ రావలసిన పని ఏమీ లేదు. ఎక్కడ పని ఉంటే అక్కడ ఉంటాను కానీ పని లేని చోటికి నేను రాను. గౌరవాలకోసం ఢిల్లీ ఎందుకు అన్నారు. ఈ స్వరాజ్యం ఎందుకు - ప్రజలు సుఖపడటం కోసం స్వరాజ్యం. మనని ఇతరులు పరిపాలించకుండా, మనల్ని మనం పరిపాలించుకోవటం కోసం స్వరాజ్యం. మనల్ని మనం పరిపాలించుకున్నప్పుడు కూడా ప్రజలు సుఖంగా లేనప్పుడు స్వరాజ్యం దేనికి? సురాజ్యం లేకపోతే స్వరాజ్యం వల్ల ప్రయోజనం లేదు. స్వరాజ్యం సురాజ్యం కింద మారకపోతే గడ్డిపరకతో సమానం అన్నారు.



**భగవంతుడు చెప్పిన మాటలను చెవులతో వినండి. చెవుల దగ్గర మీ మనస్సు ఉండాలి. మీరు విన్న మాటలను మననం చేసుకోండి. మీకు వెంటనే ఆత్మజ్ఞానం కలగకపోయిన ఈ ప్రక్రియలో మీరు చాలా దోషాల నుండి, బలహీనతల నుండి బయటకు వచ్చేస్తారు.**



# అరుణాచల మహత్మ్యం
# అక్షరమణమాల

**లో దూరి లాగి నీ లోగుహను చేరగా**

**నమరించి తేమొకో అరుణాచలా!**

**తాత్పర్యం :** నీవు నాలో ప్రవేశించి, నన్ను అంధకారమనే గూటిలోనుంచి బయటికి లాగి, నీ హృదయగుహలోనికి నన్ను గుంజుకొని, ఆత్మస్వరూపములో నేను స్థిరంగా ఉండునట్లు చేసావు. ఇలా ఎందుకు చేసావు అరుణాచలా?

**లోదూరి లాగి** - నువ్వు నా లోపలికి దూరావు! నేను తిరుచ్చుళిలో ఉన్నాను, ఆడుకుంటున్నాను, చదువుకుంటున్నాను, ఓ అరుణాచలేశ్వరుడా, లోకంలో అందరి పిల్లలతో పాటు నేనూ ఉన్నానయ్యా! పరమేశ్వరుడని, మోక్షమని, జ్ఞానమని ఇవేమీ నాకు తెలియదయ్యా! నేను ఆడుకుంటున్నాను, పిల్లలతోటి ఈతలు ఈదుకొంటున్నాను. పరుగులు పెడుతున్నాను, బడిలోకి వెళ్తున్నాను వస్తున్నాను. అందరితోపాటు నేను తింటున్నాను, తిరుగుతున్నాను. ఈ రకంగా నాకు రోజులు గడిచిపోతున్నాయి. ఈ లోపల ఎక్కడి నుంచి వచ్చావో, ఎలా వచ్చావో, ఎప్పుడు వచ్చావో నాకు తెలియదు. నాకు తెలియకుండానే వచ్చి నా లోపల దూరావయ్యా, నా కొంప ముంచేశావయ్యా, అరుణాచలా!

ఓ అరుణాచలేశ్వరుడా, నా లోపలికి వచ్చావు, నా కొంప కూల్చేసావు, నన్ను బయటికి లాగేసావు. నా గొడవలో నేను ఉన్నాను, నా రాగద్వేషాలతోటి నేను ఉన్నాను, నా కష్టసుఖాలతోటి నేను ఉన్నాను. ఏదో నా బాధలతోటి నేను ఉన్నాను. ఈ లోపల నాలోపల నువ్వు దూరావు. ఎప్పుడు దూరాడు, ఎలా దూరాడు, అనుకొంటున్నాను, ఈ లోపల నన్ను బయటికి లాగేసావు, నన్ను రోడ్డు ఎక్కించేసావు, నన్ను బట్టబయలు చేసేసావు అరుణాచలా!

ఇదేంటయ్యా, ఇది నీకు న్యాయంగా ఉందా? అందరితో పాటు వాడినే కదా నేను నాలో ప్రత్యేకత ఏమీ లేదు. నీకేమైనా దండలు వేసానా, గౌరవం చేసానా, నీకేమైనా హోమాలు చేసానా, లేకపోతే యజ్ఞాలు చేసానా? నేనేమైనా సత్తరువులు కట్టించానా, ఆశ్రమాలు కట్టించానా,

లేకపోతే భవంతులు కట్టించానా? నీ గురించి రచనలు చేసానా, ఉపన్యాసాలు చెప్పానా, నీకేమైనా ఓట్లు వేసానా? ఏమీ లేదే, నా ఇంటిలో ఉన్నానే, నా కాలక్షేపం నేను చేసుకొంటున్నానే! నేను పిల్లవాడిని, చదువుకొంటున్నాను. నా కుటుంబానికి నన్ను కాకుండా, నా లోపలకి దూరి, ఎప్పుడు దూరావో నాకే తెలియకుండా దూరావు. ఎంతపని చేసావు అరుణాచలేశ్వరుడా! ఇలా చేస్తావా, ఇలా చెయ్యటం నీకు ధర్మంగా ఉందా! పోనీ లోపల దూరావు, దూరినవాడివి దూరినట్టుగా ఉండాలి. నన్ను బయటికి లాగేసావు, నన్ను చీల్చేసావు, రంపపు కోత! రంపం పెట్టి కోసావు! నాకు తెలియకుండానే ఈ పనులు అన్నీ నువ్వు చేసి, నన్ను బయటికి లాగావు.

**నీ లోగుహను చేరగా** - బయటికి లాగి నన్ను ఎక్కడా వదిలేయలేదు; ఈ ప్రకృతిలో, ఈ జన్మ పరంపరలో, ఈ సంసారంలో నన్ను వదిలేయలేదు, ఈ పంచభూతాలలో నన్ను కలిపేయలేదయ్యా ఓ అరుణాచలేశ్వరుడా! ఈ ప్రకృతి ప్రవాహంలో, ఈ జననమరణ ప్రవాహంలో కొట్టుకుపోకుండా నన్ను ఏమి చేసావంటే - నీ లోగుహను చేరగా - నీ అంతఃకరణం నాకు ఇచ్చావు  నీ హృదయంలో నన్ను చేర్చుకున్నావు, అందలం ఎక్కించావు, మోక్షశిఖరానికి నన్ను ఎక్కించావు, నీ స్వరూపాన్ని నాకు ఇచ్చావు. బయటికి లాగేసి నన్ను ఎక్కడా వదిలేయలేదు. నీ హృదయంలో నాకు స్థానం ఇచ్చావు, నీ హృదయకుహరంలో నన్ను చేర్చుకున్నావు. నన్ను రక్షించావు అరుణాచలా!  ఎక్కడో ఆడుకొంటున్న కుర్రవాడిని, చదువుకొంటున్న కుర్రవాడిని, నాలో ప్రవేశించి, నన్ను బయటికి లాగి, నీ హృదయంలో నన్ను ప్రవేశ పెట్టి, నీ స్వరూపాన్ని ఇచ్చి, నీ అంతస్థుని ఇచ్చి, నీ అంతటి వాడిని నన్ను చేసావు . నేను ఏమి చేసానని నాకు ఈ స్థానం ఇచ్చావయ్యా? ఎందుకు నన్ను చీకటిలోంచి బయటికి తీసుకొచ్చావయ్యా? నేను ఏమి ఉపకారం చేశానయ్యా అరుణాచలేశ్వరుడా! ఇదంతా నాకు తెలియకుండా, నువ్వు నాకు ఉపకారం చేస్తున్నావన్న సంగతి  నా మనస్సుకు తెలియకుండానే చేసేసావు అరుణాచలేశ్వరుడా!

ఏమిటి అరుణాచలా! నా లోపల దూరావా? నన్ను బయటికి లాగావా? నాకు తెలియలేదా? నన్ను రోడ్డు మీద వదిలేయకుండా నీ హృదయంలో నాకు స్థానం ఇచ్చావా? నీ హృదయంలోకి లాక్కున్నావా? నీ హృదయంలోకి గుంజుకున్నావా? నీ స్వరూపాన్ని నాకు ఇచ్చావా? నీ ఆత్మసంపద ఇచ్చావా, నీ మోక్షపదం ఇచ్చావా? ఇచ్చి నన్ను ఈ ప్రకృతికి అతీతంగా చేసావా, ఈ ప్రపంచానికి అతీతంగా చేసావా? ఈ చీకటిలోంచి నన్ను బయటికి గుంజావా? నాకు బాధ లేకుండా, నాకు వేదన రోదన లేకుండా, ఎంత ఉపకారం చేసావయ్యా? నాకు వెలుతురుని చూపించి, వెలుతురు అనేటటువంటి ఈ ఆత్మసామ్రాజ్యానికి, మోక్షసామ్రాజ్యానికి చక్రవర్తిని చేసేసి ఉన్నతశిఖరాల మీద కూర్చోపెట్టావు అరుణాచలేశ్వరుడా!

**అమరించితేమోకో అరుణాచలా** - నాకు ఇంత ఉపకారం చేసావు కదా రైటే; నేను నీకు ఏమి ఉపకారం చేసాను? నీకు నేను ఏంచేసానని నాకు ఇదంతా చేశావయ్యా? నీ పేరు స్మరించానా, నీకేమైనా పూజలు చేసానా, నీ పాదాలకి నమస్కారాలు పెట్టానా, నీకేమైనా జపాలు చేసానా, నీకేమైనా హోమాలు చేసానా, నీకేమి చేశానయ్యా అరుణాచలేశ్వరుడా! నీకు ఏమి

ఉపకారం చేసానని నాకు ఈ స్థితిని ప్రసాదించావు? ఈ శాంతిస్థితిని, అమృత స్థితిని ప్రసాదించావయ్యా! నా దగ్గర ప్రత్యుపకారం ఏమీ ఆశించకుండా మోక్షసామ్రాజ్యానికి అధిపతిని చేసి, మహోన్నతమైన, ఉదాత్తమైనటువంటి శిఖరాల మీద కూర్చోపెట్టి, లోకానికి వెలుగు చూపించావు అరుణాచలేశ్వరుడా!

జనరల్‌గా లాజిక్ ఏమిటంటే, మీ ఇంటికి వస్తే నాకేమిస్తావు, మా ఇంటికి వస్తే నువ్వేమి తెస్తావు! ఇటువంటి రోజులలో, ద్వేషంతోటి అసూయతోటి కక్షలతోటి కార్పణ్యాలతోటి, స్వార్థపూరితమైనటువంటి ఈ రోజులలో, ఈ కలియుగంలో, నువ్వు ఇంత పని చేశావయ్యా అరుణాచలేశ్వరుడా! ఆడుకుంటున్న కుర్రవాడిని అందలం ఎక్కించావయ్యా అరుణాచాలా! ఓ అరుణాచలేశ్వరుడా, నువ్వు స్మరించావు కాబట్టి, నేను నిన్ను స్మరిస్తున్నాను కానీ, నువ్వు నన్ను స్మరించకపోతే నేను నిన్ను స్మరించగలనా అరుణాచలా! ఎంతపని చేసావు అరుణాచలా! నీ హృదయ కుహరంలో నన్ను చేర్చుకున్నావు అరుణాచలా. అక్కడ ఏముంది? సృష్టి యొక్క మూలం ఉంది, అక్కడ వెలుగు ఉంది అరుణాచలా. ఆ వెలుగులో నన్ను ఒకడిగా తీసుకొని, ఆ అనుభవాన్ని నాకు ఇచ్చావు.

ఇదంతా నువ్వు చేసిన మాట నిజమే. ఎందుకు చేసావో నాకు తెలియటంలేదు అరుణాచలా. ఒక వేళ అర్హత ఉన్నవాళ్ళు యోగ్యత ఉన్నవాళ్ళు ఉంటే గురువుకి అలా అనిపిస్తుందేమో. మొదటిలో రామకృష్ణుడి దగ్గరికి వచ్చేవాడు కాదు నరేంద్రుడు. కానీ నరేంద్రుడి అర్హత యోగ్యత తెలుసు రామకృష్ణుడికి. నరేంద్రుడి ఇంటి పొరుగువారు ఎవరైనా వస్తే రామకృష్ణుడు వాళ్ళతో, నరేంద్రుడు ఈ మధ్యన ఆ అబ్బాయి నాకు కనిపించటం లేదు, ఒకసారి నన్ను చూసి వెళ్ళమని చెబుతారా, నాకు కనిపించమని చెబుతారా అని చెప్పేవాడు. ఆ అబ్బాయికి మీమీద ప్రేమ లేనప్పుడు, మీకు వాడి మీద ప్రేమ ఎందుకండీ అనేవారు వాళ్ళు. అప్పుడు రామకృష్ణుడు అలా అనకండి వాడు ఈశ్వరకోటిలోని వాడు అనేవారు. వాడు ఎంత బుద్ధిమంతుడో, ఎంత ఉపకారో, మానవజాతి కోసం ఎంత తపిస్తాడో, భవిష్యత్తులో తోటి మానవుల కోసం ఎంత జీవించే మనిషో అతను! అతను శివాంశ సంభూతుడు, అతను ఎంతటి వాడో మీకు తెలియదు. మీకు ఎప్పుడైనా వాడు కనిపిస్తే, రామకృష్ణుడు మిమ్మల్ని చూడాలని ఉంది అంటున్నారు, నరేన్‌ని రమ్మని చెప్పరా! అనేవాడు రామకృష్ణుడు. అంటే గురువే లాక్కొంటున్నాడు తన దగ్గరికి. ఏమిటి అక్కడ అర్హత? ఆ హృదయంలో ఉన్నటువంటి వైశాల్యం, ఆ బుద్ధిలో ఉన్నటువంటి పక్వత, అతని ఇంద్రియాలకి ఉన్నటువంటి నిర్మలత్వం, తోటి మానవుల పట్ల దయ, తోటి మానవులకి ఉపయోగపడేటటువంటి ఆ సేవాభావం, ఇన్ని గుణాలు అక్కడ ఉన్నాయి కాబట్టి, ఆ మనిషి కోసం రామకృష్ణుడు తపిస్తున్నాడు. శిష్యుడి కోసం గురువే తపిస్తున్నాడు.

అందుచేత మీకు అర్హత ఉంటే, యోగ్యత ఉంటే, మీ బుద్ధి పక్వానికి వస్తే, మీ హృదయం విశాలమైతే, పరమేశ్వరుడు మీ గుమ్మం దగ్గరికి వస్తాడు!



# శ్రీమద్భగవద్గీత

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణముల నుండి)

**- సేకరణ : బేబీ, హైదరాబాద్**

**(11వ అధ్యాయం, 55వ శ్లోకం)**

**శ్రీనాన్నగారు :** ఆచార్యులవారు భగవద్గీత గురించి చెపుతూ మీరు 700 శ్లోకాలు చదవలేకపోతే, 700 శ్లోకాల సారం ఈ ఒక్క శ్లోకంలో ఉంది అన్నారు. ఇందులో జ్ఞానయోగం, కర్మయోగం, భక్తియోగం అన్నీ ఉన్నాయి. ఈ శ్లోకాన్ని ముట్టుకొంటే మొత్తం 700 శ్లోకాలను ముట్టుకొన్నట్లే. గీతాసారం అంతా ఈ శ్లోకంలో ఉంది అని చెప్పారు. అంటే మిమ్మల్ని మిగతా శ్లోకాలు చదవవద్దని కాదు. మనం గంగానదిలో ఒక చోట స్నానం చేస్తే గంగానదిలో అంతా మనం స్నానం చేసినట్లే. అంతా అదే నీరు కదా.

**మత్కర్మకృత్ మత్పరమో మద్భక్తః సంగవర్జితః**
**నిర్వైరః సర్వభూతేషు యస్సమామేతి పాండవ।**

**తాత్పర్యము :** అర్జునా! కర్తవ్యకర్మలను అన్నింటిని నాకే అర్పించువాడును, మత్పరాయణుడును, నా యందు భక్తిశ్రద్ధలు గలవాడును, ప్రాపంచిక విషయములయందు ఆసక్తిలేని వాడును, ఏ ప్రాణియందును ఏ మాత్రమూ వైరభావము లేనివాడును అయిన అనన్య (పరమ) భక్తుడు మాత్రమే నన్ను పొందగలడు.

**మత్కర్మకృత్ :** మీరు నా పని చేస్తూ ఉండండి. నాకు ఇష్టమైన పని చేయండి, నేను ఏపని అయితే చెయ్యమన్నానో ఆ పని చేయండి. నేను వద్దు అని చెప్పిన పని మానేయండి. మీరు ఎలా పని చేస్తే నా దయ మీకు కలుగుతుందో అలా పని చెయ్యండి.

నా పనులు చెయ్యి అంటే సత్కర్మలు చేయండి. సత్కర్మలు కూడా నిరాడంబరంగా, నిరహంకారంగా చేయండి, గుర్తింపులకోసం చేయవద్దు. నా దయను సంపాదించటంకోసం పని చేయండి. నా దయ లేకుండా నీకు నేను తెలియబడను. మనం చేసే పనిని మన అహంకారానికి, మన మనస్సుకు ఆఫర్ చేయకూడదు, ఈశ్వరుడికి ఆఫర్ చెయ్యాలి.

మనం పరమాత్మ కంటే భిన్నంగా ఉన్నాము అని అనుకొంటున్నాము. మనమే తెలివైన వారము, ఇదంతా మనవల్లే జరిగిపోతోంది అనుకొంటే మన మనస్సు చావదు. పరమాత్మను కాదని మనం ఏదైనా సాధించగలము అనే బుద్ధి ఉన్నంతకాలం మనం సాధన చేయవలసిందే. నీ మనస్సుకంటే ఒక హయ్యర్ పవర్ ఉందని నీ మనస్సు గుర్తించేవరకు అది నశించదు. అందరి హృదయాలలో ఆత్మగా ఉన్నాను, వారి ప్రారబ్ధమును అనుసరించి ఆడించే వాడిని నేనే అని పరమాత్మ చెప్పాడు.

నువ్వు పని చేస్తూనే పొందవలసింది ఏదో పొందాలి. పని మానివేస్తే సోమరితనం వస్తుంది. నువ్వు ఎలా పని చేస్తే భగవంతుడిలో ఐక్యమవుతావో గురువును ఆశ్రయించి ట్రైనింగ్ పొంది అలా పని చెయ్యటం నేర్చుకో, అదే యోగం. అలా పని చేస్తే కర్మ కూడా యోగం అయ్యి, నది వెళ్లి సముద్రంలో ఐక్యమయినట్లు మీరు నాలో ఐక్యమవ్వటానికి కర్మ మీకు సహాయ సహకారములు అందిస్తుంది. మీరు ఫలకాంక్ష లేకుండా పనిచేస్తే మీకు రెండు లాభాలు. ఫలితం వస్తుంది, ఈశ్వరుని దయ కూడా వస్తుంది. ఫలకాంక్షతో పని చేస్తే ఫలితం రావచ్చు కానీ ఈశ్వరుని దయ రాదు. నువ్వు పని చేసేటప్పుడు లోపల ఏ ఉద్దేశంతో చేస్తున్నావో దానినిబట్టి ఈశ్వరుడు మార్కులు వేస్తాడు, కానీ నువ్వు పెద్ద పని చేసావా, చిన్న పని చేసావా అని ఆయనకు అక్కరలేదు. జీవుడు ఎవరు, దేవుడు ఎవరు అంటే స్వామి వివేకానంద స్వార్థమే జీవుడు, స్వార్థం లేకుండా ఉండటమే దేవుడు అనేవారు. మనం చేసే పని వలన మనకు దేహాభిమానం తగ్గాలి, శవబుద్ధి తగ్గాలి. శవబుద్ధి తగ్గకుండా నీకు ఆత్మబుద్ధి కలుగదు.

**మత్ పరమః :** అంటే మీ ధ్యాస నామీదే ఉండాలి. ధ్యాస కుదిరితే ధ్యానం కుదురుతుంది. ధ్యానం కుదరాలి అంటే మనకు పరమేశ్వరుడి మీద ఇష్టం ఉండాలి, ప్రేమ ఉండాలి. ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అని నూటికి నూరు పాళ్ళు విశ్వాసం ఉండాలి. అప్పుడు నామీద నీ మనస్సు నిలబడుతుంది అంటున్నాడు పరమాత్మ. మహాత్ముల సన్నిధిలో ధ్యానం చేస్తే వారి వైబ్రేషన్స్ మన మీద పని చేస్తాయి. వారి గ్రేస్ మిమ్మల్ని లోపలకు

తీసుకొనిపోతుంది. మీరు ఏ వస్తువునైతే ధ్యానం చేస్తున్నారో ముందు అక్కడ ప్రీతి ఉండాలి. నాకు భగవంతుడి మీద మనస్సు నిలబడటం లేదు అన్నాడు ఒక ఆయన. అప్పుడు నేను ఆయనతో, మీకు అదనంగా ఇష్టం వద్దు, మీ అబ్బాయి అంటే మీకు ఇష్టమే అంటున్నారు కదా, ఆ మాత్రం ఇష్టం భగవంతుడి మీద పెట్టండి సరిపోతుంది అని చెప్పాను.

నన్నే నీ గమ్యంగా పెట్టుకో, నువ్వు పొందవలసినది నన్నే అంటున్నాడు పరమాత్మ. కానీ మనం భగవంతుడిని గమ్యంగా పెట్టుకోము. మనం కోరికలని గమ్యంగా పెట్టుకొని, ఆ కోరిక నెరవేరటానికి భగవంతుడిని బల్లకట్టుకింద ఉపయోగించుకుంటున్నాము. మనకి కోరిక గమ్యం కానీ, భగవంతుడు గమ్యం కాదు. ఇక్కడ పరమాత్మ ఏమంటున్నాడు అంటే గమ్యంగా నన్ను పెట్టుకో, నన్ను పొందటానికి సాధన చెయ్యి అంటున్నాడు. నీ ప్రయత్నం సిన్సియర్‌గా ఉండాలి, డెడికేటెడ్‌గా ఉండాలి. తరువాత కాలం కలిసిరావాలి. భగవంతుడి అనుగ్రహం ఉండాలి. ఇన్ని రకాలుగా కలిసివస్తేనే నీకు మోక్షం సాధ్యం అవుతుంది.

మనందరం చేసే పొరపాటు ఏమిటి అంటే మనం గుడిలో పువ్వులు ఇస్తున్నాము పళ్ళు ఇస్తున్నాము, దానాలు చేస్తున్నాము, కాని మన టైమును భగవంతుడికి ఇవ్వటంలేదు. నేను కాలరూపంలో ఉన్నాను అని భగవంతుడు చెప్పాడు. ఎవరిని అడిగినా నేను చాలా బిజీగా ఉన్నాను అంటున్నారు. ఏ విషయంలో బిజీగా ఉంటున్నారు? భగవంతుడిని తెలుసుకోవటానికి ఎంత టైము ఖర్చుపెడుతున్నారు? మీరు గంటకో రకంగా ఉంటున్నారు. మీకు స్థిరత్వం లేదు. కూర బాగాలేదు అని మీ భర్త అంటే వెంటనే మీకు కోపం వచ్చేస్తుంది. చిన్న మాటను కూడా భరించలేకపోతున్నారు. నువ్వు కేవలం పూజ చేయుటమే కాదు నీ జీవితంలో వచ్చే కష్టాలను, నిందలను భరించాలి. వ్యవసాయాత్మక బుద్ధి కలిగి ఉండు అర్జునా అంటున్నాడు పరమాత్మ. అంటే నిశ్చలమైన బుద్ధి కలిగి ఉండాలి. అక్కడ వేవరింగ్ ఉండకూడదు.

మీరు కృష్ణుడి రూపాన్ని తలపెట్టుకోండి, ఆయన నామాన్ని స్మరించుకోండి, ఆయనే మనకు పెద్ద చుట్టం అనుకోండి. ఆయన బోధను మన బుర్రలో తిప్పుకోవాలి. మన మనస్సును ఇంద్రియాలను ఆయనలో నానబెట్టాలి. అప్పుడు మన మనస్సు ఇంద్రియాలు సంస్కరింప బడతాయి. సంస్కరింపబడిన మనస్సుకు లోచూపు కలుగుతుంది. అప్పడు బయట ఉన్న నారాయణుడు లోపలి నారాయణుడిని పట్టి ఇస్తాడు.

**మద్ భక్తః :** మీరు నా పట్ల భక్తి కలిగి ఉండండి అన్నాడు పరమాత్మ. నాకు అంటే అక్కడ శరీరం అని కాదు, సత్యం అని మనం మరిచిపోకూడదు. మనందరం భక్తులం

కాకపోయినా భక్తుల కింద చెలామణి అవుతున్నాము. ఆచార్యులువారు ఎవడు భక్తుడు అని చెప్పారంటే, నీ ఇంద్రియాలకు, మనస్సుకు 24 గంటలు వాసుదేవుడు తప్పించి ఏమీ కనబడకుండా ఉంటే మీరు భక్తులు. అప్పుడు మీరు వాసుదేవుడిలో లయం అవుతారు అని చెప్పారు. భక్తుడి లక్షణాలు ఏమిటి అంటే, మీరు ఖరీదైన బట్టలు కట్టకూడదు, తినే ఆహారం సామాన్యంగా ఉండాలి. మీకు డబ్బు ఉంటే దాచుకోండి. డబ్బు ఉందని ఖరీదైన బట్టలు కడితే, భక్తుడి లక్షణాలు పోయి రజోగుణం వచ్చేస్తుంది. మన జీవిత విధానం మనలో ఉన్న సత్వగుణాన్ని పెంచాలి గానీ రజోగుణాన్ని పెంచకూడదు. మీరు సాధ్యమైనంత వరకూ నిరాడంబరంగా ఉండాలి. భక్తి పేరు మీద సామాన్య మానవుడికి దూరం అవ్వకూడదు. కృష్ణుడు అంత పాపులర్ గాడ్ ఎందుకు అయ్యాడు అంటే ఆయన కామన్ మాన్‌కి దూరం అవ్వలేదు. కామన్ మేన్‌తో కలిసి ఉండేవాడు. మన భక్తి ఎంతవరకు వచ్చింది అని చూసుకోండి. నీ ఇంద్రియాలకు భగవంతుడే కనబడాలి, నీ మనస్సుకు భగవంతుడే కనబడాలి. నువ్వు ఎవరికైనా మంచి చేస్తూ ఉంటే ఆ మంచి ఎవరు పొందుతున్నారు అంటే ఆ దేహం ద్వారా వాసుదేవుడే పొందుతున్నాడు. అక్కడ ఎల్లయ్య, పుల్లయ్యలను చూడకు, వాసుదేవుడినే చూడు. అప్పుడు నీకు బేధబుద్ధి పోతుంది. బేధబుద్ధి ఉన్నంతకాలం పునర్జన్మను ఎవరూ ఆపలేరు.

కొంతమంది శనివారం ఒకరకంగా ఆదివారం ఒక రకంగా ఉంటారు. వాళ్ల మాట నిలకడగా ఉండదు, మనస్సు కుదురుగా ఉండదు. ఈ నిలకడలేని భక్తిని వ్యభిచార భక్తి అంటారు. కొంతమంది భక్తికి స్థిరత్వం ఉంటుంది, అసలు చలనం ఉండదు. వాళ్లకి ఏదైనా నష్టం వచ్చినా, కష్టం వచ్చినా, శరీరానికి బాధలు వచ్చినా, పరమేశ్వరుడి పట్ల ఉన్న విశ్వాసం చలించదు. ఇటువంటి భక్తులు అంటే నాకు ఇష్టం అన్నాడు పరమాత్మ.

మనం రోజూ, మన మనస్సును ఇంద్రియాల ద్వారా బయటకు పంపి, ఈ ప్రపంచాన్ని నాకటమే మన పని. అక్కడ ఏమి జరిగింది, ఇక్కడ ఏమి జరిగింది, వారు ఏమనుకొంటున్నారు, వీరు ఏమనుకొంటున్నారు, అని చనిపోయేవరకు డైరెక్టుగానో ఇండైరెక్టుగానో మామిడిటెంకను నాకినట్లుగా ఈ ప్రపంచాన్ని నాకుతున్నాము. అంతకంటే మనకు ఏమైనా పని ఉందేమో చెప్పండి. డబ్బు గురించి ఆలోచించినా, గౌరవం గురించి ఆలోచించినా అది ప్రపంచాన్ని నాకటమే. ఎందుచేతనంటే ఇవన్నీ ప్రపంచంలో ఒక భాగమే కాని సత్యంలో ఒక భాగం కాదు.

**సంఘవర్జితః :** అంటే ప్రపంచంలో ఏ విషయాల మీద ఆసక్తి పెట్టుకోవద్దు. మనం ప్రపంచాన్ని కౌగిలించుకొంటున్నాము. మనం ప్రపంచాన్ని ఎంత గట్టిగా ముద్దుపెట్టు కొంటున్నాము అంటే, సిగరెట్ కాల్చేవాడు చివరిదమ్ము ఎలా లాగుతాడో అంత గట్టిగా మనం ప్రపంచాన్ని ముద్దు పెట్టుకొంటున్నాము. అంటే మనం ఆరోజుకారోజు దేవుడికి దూరమవుతున్నాము, ప్రపంచానికి దగ్గరవుతున్నాము. అంటే మనకు తెలియకుండా పునర్జన్మలు పెంచుకొంటున్నాము. ప్రపంచ విషయాల మీద వైరాగ్యం లేకుండా ఎవడికీ జ్ఞానం రాదు. మనం బయటకు చాలా స్పీడుగా వెళతాము కానీ ఒక్క అంగుళం కూడా లోపలికి దిగలేము. సత్యానుభవం పొందాలంటే నువ్వు లోపలకు ప్రయాణం చెయ్యాలి. ఎక్కడో నేను పైన ఉన్నాను అని భగవంతుడు చెప్పలేదు, మీ హృదయంలో ఉన్నాను అని చెప్పాడు.

మీ ఇంటిదగ్గర మీ డ్యూటీ మీరు చెయ్యండి. కానీ హృదయంలో మటుకు భగవంతుడికి స్థానం ఇవ్వండి. మనం పొందవలసినది నారాయణుడు. మన ఇంట్లో వాళ్లకి, మనకి ఉన్న సంబంధాలు స్వప్న సంబంధాలు. ఈ దేహం ఎంత నిజమో ఈ సంబంధాలు కూడా అంతే నిజం అనుకుని, మనకి నిజమైన బంధువు భగవంతుడే అని తెలుసుకొని, మీ హృదయంలో ఉన్న భగవంతుడికి దగ్గర అవ్వటానికి ప్రయత్నం చెయ్యండి. ఇంట్లో వాళ్లకి చేతులతోటి పనులు చేసినా, మనస్సులో మటుకు భగవంతుడిని విడిచిపెట్టకండి. మానసికంగా మీరు భగవంతుడికి దూరం కావద్దు.

సన్యాసాశ్రమం అంటే మనమందరం కాషాయబట్టలు కట్టుకోనక్కరలేదు, ప్రపంచంతో మనకు ఉన్న సంపర్కం వదిలేయాలి. ప్రతీ మనిషికి రాగద్వేషాలు ఉంటాయి. రాగద్వేషాలను వేరుతో సహా, నిశ్శేషంగా ఎవడైతే తొలగించుకొన్నాడో వాడే సన్యాసి.

**నిర్వైరః సర్వభూతేషు :** ఎవరైనా మీకు అపకారం చేసినా, మిమ్మల్ని పొరపాటుగా మాట్లాడినా, వారిపట్ల మీరు వైరభావం పెట్టుకోవద్దు. వాళ్ళతోటి స్నేహం చెయ్యటం ఇష్టం లేకపోతే మానేయండి, కాని వాళ్ళ మీద కోపాలు, ద్వేషాలు పెట్టుకోవద్దు. వారిపట్ల మీరు వైరం పెట్టుకొంటే మనస్సు బాహ్యముఖానికి వెళ్ళిపోతుంది. మిమ్మల్ని ఎవరైనా ప్రేమిస్తూ ఉంటే మీరు తిరిగివారిని ప్రేమిస్తారు. మిమ్మల్ని ద్వేషించే వారిని మీరు ప్రేమించరు. మిమ్మల్ని ద్వేషించేవారిని కూడా ప్రేమించగలగాలి. లేకపోతే మీకు భక్తి లేనట్లే. ఫలానా వ్యక్తి మా శత్రువు అని అనుకోవద్దు. ఎందుచేతనంటే అలా అనుకోవటం వలన మన మనస్సు బాహ్యముఖానికి పోతుంది. నీవు ఎవడి మీద అయితే ద్వేషం పెట్టుకొన్నావో నిరంతరం

వాడే నీకు జ్ఞాపకం వస్తాడు, మనస్సు వాడినే తలపెడుతుంది; కాని నీకు వాసుదేవుడు జ్ఞాపకం రాడు. అందుచేత నన్ను పొందటం కోసం అయినా మీరు విరోధాలు వదులుకోండి అంటున్నాడు పరమాత్మ.

ప్రపంచంలో ఉన్న జీవకోటి అందరిపట్లా నువ్వు పాజిటివ్ గానే ఉండు, నెగటివ్‌గా ఉండవద్దు. మీరు డబ్బు ఎలా సంపాదించుకొంటున్నారో, విద్య ఎలా సంపాదించుకొంటున్నారో, అలా కష్టపడి మంచిగుణాలను, దైవీగుణాలను సంపాదించుకొంటే అప్పుడు వాడు నాకు భక్తుడు అవుతాడు. అప్పుడు వాడి అజ్ఞానాన్ని తీసేసుకొని నా స్వరూపాన్ని వాడికి ఇస్తాను అంటున్నాడు పరమాత్మ. భగవదనుభవం పొందటానికి ఏ కామక్రోధాలు అయితే అడ్డు వస్తున్నాయో, వాటిని తొలిగించుకోవటానికి మీరు ఎంతో కష్టపడుతున్నారు. కష్టపడినా ఫెయిల్ అవుతున్నారు అని ఆయన గ్రహించి మీ కామక్రోధాలను ఆయన నాకేస్తాడు. నాకేసి మిమ్మల్ని వదిలేయడు, ఆయన స్వరూపాన్ని మీకు ఇస్తాడు. వాడు పరమాత్మ!

మీ ప్రవర్తన అహంకారపూరితంగా కాకుండా, భక్తిపూరితంగా ఉంటే; దేహం మనస్సు కేంద్రం కాకుండా, దైవాన్ని కేంద్రంగా పెట్టుకొని నువ్వు జీవిస్తూ ఉంటే; నువ్వు అహంకారాన్ని పెంచుకోవటానికి కాకుండా, దైవానుగ్రహం సంపాదించటానికి పనిచేస్తూ ఉంటే, ఇంక నేను ఎక్కడికి పోతాను అర్జునా! నేను నీకు దొరికేస్తాను. నేను నీకు లభ్యమవుతాను అన్నాడు పరమాత్మ.

మీ ఇంద్రియాలకు మనస్సుకు వాసుదేవుడే కనిపించాలి. వాసుదేవుడికి భిన్నంగా మీకు ఏదీ కనబడకూడదు. అప్పుడు ఆయన అనుగ్రహానికి పాత్రులు అవుతారు. ఎవరైతే వాసుదేవుడి అనుగ్రహానికి పాత్రులయ్యారో ఆయన స్వరూపం మీకు ఇవ్వబడుతుంది. మీలో ఉన్న అజ్ఞానాన్ని ఆయన తీసుకొని ఆయనలో ఉన్న జ్ఞానాన్ని మీకు ఇస్తాడు. ఈ వాఖ్యాన్ని రోజూ మననం చేసుకోండి, దేవుడి రూపాన్ని ధ్యానించినట్టే ఈ వాక్యాన్ని ధ్యానం చేయండి. ఈ వాక్యాన్ని నేను బాగా ఇష్టపడుతున్నాను కాబట్టి మీకు రిపీటెడ్‌గా చెబుతున్నాను. మీ ఇంద్రియాలకు, మనస్సుకు నేను తప్పించి ఏదీ కనబడకూడదు అంటున్నాడు పరమాత్మ. ఇంక అప్పుడు క్రియేషన్ ఎక్కడ ఉంది? అప్పుడు మీరు నో మైండ్ స్టేట్‌కు వెళతారు. అప్పుడు సత్యం మీకు అనుభవంలోకి వస్తుంది.

## శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805

| | |
|---|---|
| అక్టోబరు 8 | విజయ దశమి - భీమవరం రాముగారి ప్రవచనము |
| అక్టోబరు 13 | ఆదివారం - హైదరాబాద్ అరుణగారి ప్రవచనము |
| అక్టోబరు 20 | ఆదివారం - అమలాపురం మాష్టారి ప్రవచనము |

## ఆంధ్ర ఆశ్రమము, తిరువణ్ణామలై ఫోన్ : 04175-236174

For Accomodation : Office Incharge Balaraju 08297672348, 9849124502

## రమణ భాస్కర చందాదారులకు విన్నపం

**మీ చందా గడువు ముగిసినది.**

**కావున చందాను పునరుద్ధరించుకోగలరు.**

భక్తుల కోరికపై సద్గురువు శ్రీ నాన్నగారి భోదామృతం ఇంకా వివరంగా అందివ్వాలనే ఉద్దేశంతో **రమణభాస్కర** మాసపత్రిక సెప్టెంబరు సంచిక నుండి మార్పులు చేస్తున్నాము. దీనికి భక్తుల నుండి సలహాలు, సూచనలు ఆహ్వానిస్తున్నాము. పత్రికకు సంవత్సర చందా కట్టడంలో భక్తులు ఇబ్బందులు చెపుతున్నందు వలన ఇప్పటినుండి **శాశ్వతచందా** (10 సం॥లకు) రు॥ **1200**/-లుగా నిర్ణయించడమైనది. భక్తులందరూ ఈ అవకాశమును ఉపయోగించుకొని రమణభాస్కర మాస పత్రికకు శాశ్వత చందాదారులుగా చేరి పత్రికను ప్రోత్సహించవలసినదిగా కోరుచున్నాము.

**శాశ్వత చందా** (10 సం॥లకు) రు॥ **1200**/-లు
**సంవత్సర చందా** రు॥ **150**/-లు

మీ చందాను స్వయముగా గానీ, లేదా శ్రీ రమణ క్షేత్రం, కార్పొరేషన్ బ్యాంక్ అకౌంట్ నెం. 520101264185724 (IFSC Code : CORP0001613) నందు గాని చెల్లించగలరు. చందాను బ్యాంక్ అకౌంట్‌లో జమ చేసినవారు జమ చేసిన తేదీ, వారి పూర్తి అడ్రసు 8883174999కు తెలియపరచగలరు.

# అశాంతికి వేదనకు మనస్సే మూల కారణం

పొరపాట్లు చేసే మనస్సు కొత్త కొత్త దారులను వెదుక్కుంటుంది. కొత్త పొరపాట్లు చేయటానికి పూనుకొంటుంది. ఆ విషయం స్వయంగా మనకు కూడా తెలియదు. అక్కడ ఎఱుక నిత్యం ఉండేలా చూచుకోవాలి. లేదా పరమానందయ్యగారి శిష్యులు అంటారు 'నిన్న చేసిన పొరపాట్లు ఈ రోజు' సరిజేసుకొటున్నాము. "రోజూ" గురువుగారికి అదే సమాధానం. మనం అలా ఉండకుండా జీవితాన్ని ప్రేమను, ఉనికిని తెలిసినవాడు తర్కానికి పోనుపోను దూరమౌతాడు. మనస్సు ఆగు అంటుంది, లేదా రేపు అంటుంది. దాన్ని గురించి ఆలోచించమంటుంది. మనస్సు ద్వారా సాగిపోయే ఆలోచనలకు ఏనాటికీ ముగింపులేదు. మనస్సు మందమతి చాలా తెలివి ఉంది నాకు అనుకొనే మనషులు కూడా మందమతులే. నిజమైన తెలివితేటలు 'స్ఫురణ' ధ్యాన కేంద్రానికి చెందినది. మనస్సు చెందినదికాదు. మనస్సు మనచేత బుద్ధిహీనమైన పనులను చేయిస్తుంది. ఒకపని అయిపోగానే మరో మూర్ఖపు పనికి ప్రేరేపిస్తుంది. మనస్సు మెద్ధది. శ్రీనాన్నగారు "చదువురాని వాడు మూర్ఖత్వ మనిషి అంటారు, బాగా చదువుకొన్న మహాచదువరి అదనపు మూర్ఖత్వం" అన్నారు. ఇవి అన్నీ మనో పరిధిలోనివే. సత్యంలోనే నిజమైన ఎఱుక ఉంది. కామాన్ని జయిస్తే, క్రోధం పోదు, క్రోధాన్ని జయిస్తే లోభం వెంటాడుతుంది. లోభాన్ని జయిస్తే అహంకారం శత్రువు అవుతుంది. నా సంతానం నా సంపద అని ఎల్లప్పడు అనుకొనేదేదీ వాస్తవానికి మనది కాదు. అంతా పరమాత్మదే. కానీ మనస్సు ఎల్లప్పడూ పై విషయాలకు భిన్నంగా ఊహించుకొంటుంది. అహంకారం (మనస్సు) ఈ ఇల్లు సరిపోదు మరో భవనం అవసరం అని ఈ బ్యాంక్ బేలన్స్ చాలదు ఇంకా పెంచాలని ఉసికొల్పుతుంది. ఎక్కడా నిలవనియ్యదు. అది తక్కువతనాన్ని, బలహీనతను అనుభవిస్తుంది దాని స్వభావం అది. బాహ్యంగా మనం ఎంత అందంగా ఉన్నా లోపల అందహీనులుగా ఉంటాము. అది ఆధిపత్యం కోసం కలలు కంటుంది. పథకాలు వేసుకొంటుంది. వ్యర్థప్రయత్నాలు చేస్తుంది. అవి అన్నీ కలలే తప్ప వేరే ఏమీ కావు, అని సునిసితబుద్ధి, నిర్మల కుశాగ్రబుద్ధి గల సాధకుడు మనస్సు మీద నిఘా వేసిన వానికి తేలికగా గ్రహిస్తాడు. మనస్సు ఆట సాగనియ్యడు. సాధనకునకు చాలినంత విజ్ఞానం లభిస్తుంది. అయితే దాన్ని నిత్య జీవితంలో తీసుకొని రావాలి. ఇది జరగకపోతే కేవలం తెలుసుకోవటమే జరుగుతుంది. మనం అందరికీ ఏమి చెయ్యాలో ఎందుకు చెయ్యాలో తెలుసు. మనస్సును ఎలా అధిగమించాలో తెలియటంలేదు. నిజమైన జ్ఞానం అనుభవించటంలోనే ఉంది. శుద్ధమైన అద్దంముందు మన ప్రతిబింబము ఎంత స్పష్టంగా కనబడుతుందో, నిర్మలమైన బుద్ధియందు ఆత్మ అంత స్పష్టంగా ఆత్మ దర్శనం కలుగుతుంది శాస్త్ర ప్రమాణం. సైలెంట్ మైండ్‌లోనే ఆనందం ఉంటుంది. ఆలోచించి మాట్లాడటం వల్ల జీవితం సరళంగా ప్రశాంతంగా సాగుతుంది. అప్పడే సత్యదర్శనం అవుతుందని పెద్దలు అంటారు.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966**

RNI. NO. APTEL / 1999 / 01667 Postal Regn. No. BMV / M - 1 / 2018 - 2020



సద్గురు శ్రీ నాన్నగారి అరుగు

Registered News Paper

Postage Prepaid

If undelivered please return to
**RAMANA BHASKARA**
Sri Ramana Kshetram
JINNURU - 534 265, W.G.Dt., A.P.

Editor & Publisher : **Bhupathiraju Venkata Lakshmi Narasimha Raju**
Jinnuru - 534 265, W.G.Dt., A.P., ☎ 08814-222808
Printer : D.S. Rao, Printed at : SRI BHAVANI OFFSET PRINTERS, SVR Complex, Main Road, Palakol - 534 260, Cell : 9848716747